# యక్షుడు — ప్రవరాఖ్యుడు

తెలుగు సారస్వతపు మాగాణులలో భావికాలపు సస్య సౌభాగ్యాన్ని సూచించు పత్రికలనే ఉచ్ఛ్రింభ్రమములు అసంఖ్యాకములుగా ఉద్భవిస్తున్నవి నేడు. అట్టివాటిల్లో ఒక మాసపత్రికకు సంపాదకుణ్ణిగా ఎరుకపరుచుకుంటున్నాను మీకు. కాని, నా పత్రికను ప్రతినెలా వెలువరింపలేకపోవడానికి సరియైన వ్యాసాలు దొరక్కపోవడమే కాకుండా ఇంకా చాలా కారణాలున్నవి. అవన్నీ చెప్పను; గ్రంథ విస్తర భీతిచేతా, 'ఎడిటర్' అనే పేరుమీది మోజువల్ల పత్రికా నిర్వహణానికి పూనుకునేవాళ్ళ లోటుపాట్లు వెల్లడిస్తే నాకు నేనే ద్రోహంచేసుకున్నవాణ్ణవుతాను గనుకా. అందుచేత ఆ విషయమలావుంచి మొన్న నాకు కలిగిన ఒక విచిత్రానుభవం మనవిచేస్తాను; అవధరించండి!

మా కుంభకర్ణుడికి మనుచరిత్రంటే చాలా యిష్టం. వాడి ప్రసంగమంతా ఆ ప్రబంధాన్నిగూర్చిన ప్రశంసే. తన ధోరణిలో విసుగెత్తించేవాడు నాకు. 'అయినా ఒకసారి చదివిచూద్దాం; నేటి మన భావకవులంటే అల్లసాని తాతగారు ఏమంత రూక్షంగా వ్రాశారో' అని బుద్ధిపోయింది నాకు. మొన్న రాత్రి పడుకుని లాంతరువెలుగున చదివేను. భావములు 'హృదయాంతరాళ సంచలనగాఢ ప్రగాఢములుగా లేవు.' అంతా అర్థమౌతూనేవచ్చింది. వ్యవహారంలో మనం మాట్లాడుకుంటూన్నట్లు నడిచింది శైలి. కథావస్తువు రమ్యంగానే వుంది: ప్రవరాఖ్యుడు రావడం, వరూధినిని కలుసుకోవడం, ఆవిడ ఆయన్ని ప్రేమించి కోరికచూపడం; ఆయనగారి వేదాంతం, ఓపరకామె ప్రేమరక్తి అపుకోలేక కౌగిలించుకోవడం, బ్రాహ్మణుడు త్రోసేసి వెనక్కు తిరిగిపోవడం—

అంతవరకే నేను జాగ్రతవస్థలో వుండి చదివింది. తరువాత వేరే ప్రపంచంలో పడ్డాను. అనగా నిద్ర వచ్చి స్వప్నంలో దిగేనన్నమాట.

అది హిమాలయ పర్వతారణ్య ప్రదేశం. అక్కడి ప్రకృతంతా వర్ణించను క్షమించండి. కథాభాగంవిడిచి అలా చేయడం రాదారిమీద నడుస్తూనడుస్తూ క్రిందికిదిగి డొంకదారిన కొంతదూరం నడిచి ముండ్లబాధపడలేక మళ్ళీ రోడ్డుకెక్కినట్లుండేమో కొంతమందికి.

ఆ మంచుకొండమీద అటూయిటూ పచార్లు చేస్తూ వుండగా ఎవరో కొంచెందూరాన దారి వెతుక్కుంటున్నట్లుగా కనుపించాడు. ప్రవరాఖ్యుడని పోల్చుకున్నాను పెద్దన్నగారి వర్ణణబట్టి. ఆ నిర్జరప్రదేశంలో కాస్సేపు ఆయనతో బాతాఖానీ వేసుకుందామని అనుకున్నా. కాని ఇంకోవ్యక్తి ఎవరో ఆ వైపునుంచివచ్చి ఆయన్ను కలుసుకున్నాడు. బహుశః ఆ నూతనపురుషుడు యక్షుడైవుండవచ్చునని ఊహచేశాను. వాళ్ళిద్దరూ ఏవో సంభాషణ మొదలుపెట్టినట్లు నాకు తోచింది. త్వరత్వరగా నడిచిపోయి ఆ సమీపంలో వున్న ఒక విశాలవృక్షము వెనుక వాళ్ళకు కనుపించకుండా నిల్చుని, జేబులోనుంచి కాగితమూ పెనసలూ తీసికొని వాళ్ళ సంభాషణంతా వ్రాసుకోవడం మొదలుపెట్టేను, బాగావుంటే నా పత్రికలో ప్రకటించుకుందామనే ఉద్దేశంచేత. వాళ్ళేమి మాట్లాడుకున్నారో ఒక్క అక్షరమైన పొల్లుపోకుండా వినిపిస్తాను చిత్తగించండి!

యక్షుడు:—పచ్చివైదీకంగా ప్రవర్తించావుకదయ్యా బ్రాహ్మణుడా! సిరిరామోకాలడ్డే రకంలా వుందే నీ వ్యవహారం!

ప్రవరాఖ్యుడు:—ఎవరు నాయనా నీవు? నీ వాలకంచూస్తే ప్రబంధనాయకుడులాగున్నావే?

య:—నేనా! స్వేచ్ఛాజీవిని, ప్రేమోపాసకుణ్ణి.

ప్ర:—ఇక్కడున్నావేం?

య:—నేనెప్పుడూ ఇల్లాంటిచోటులందే విహరిస్తుంటా. ఇక్కడిగాంగ సైకతాలూ, ఈలవలీనికుంజాలూ నాకానంద ధామాలు. సౌందర్యోపాసకుణ్ణి నేను; ఎక్కనిస్త్రీలతో ఐక్యంకోసం తపిస్తుంటాను.

ప్ర:—సరే నాకెందుకుగాని కాస్త మాయింటికి దోవచూపించి పుణ్యంకట్టుకుందూ. నాఖర్మంగాలి ఇలా వచ్చిపడ్డాను. ఈమిన్నులు పడ్డచోట.

య:—ఇట్లా, ఇల్లని కలవరింపు తప్పితే మరేమీ లేదే నీకు! వరూధినిల్లాంటి సౌందర్యవనిత తనంతదా వలచి వలచి వచ్చినప్పుడు నిరాకరించి పోతున్నావే? మధుపాత్ర వొలుకపోసుకుంటారుటయ్యా? పిచ్చివాడివిగాని.

ప్ర:—ఛీ. ఛీ. నాకా కులటసంగతి తిరిగీ జ్ఞాపకం చేసి నామనస్సును కలతపెట్టద్దు.

య:—ఇప్పటికైనా నీకు బుద్ధితిరిగి మళ్ళీ వెళ్ళేవంటే 'ఛాన్సు' వుంటుంది. బాగా ఆలోచించుకో. గంధర్వకాంతతో మదనక్రీడ! నీమీదిప్రేమ వరూధినికి ఇంకా విరక్తిగా మారలేదు; వియోగభరం పట్టలేక చెలికత్తెలతో ఉద్యానవన విహారానికి పోయింది.

ప్ర:—అల్లాంటి సలహాలు వద్దునాకు. మాయింటికి దారేమన్నా తెలిస్తే చెప్పు.

య:—అరే! మళ్ళీ ఇల్లు! ఇల్లు! నీయింటిని ఆవరించుకుని ఈవిశాల ప్రపంచంవుంది కనుపిస్తున్నదా!

ప్ర:—దాన్ని చూద్దామనే కోరికే నన్నీ అయోమయ ప్రపంచానికి తెచ్చింది. ప్రాపంచిక సంబంధము దుఃఖకర మంటారు పెద్దలు.

య:—పెద్దలంటారులే; వాళ్ళ మాటల కద్దు లేకుండా పోయింది అంతా 'ఊ' గొట్టే ప్రల్లాయులైతేను —నేను చెప్పేదేమంటే నీరుగలసిన పాలలోనుంచి హంస ఏలాగు వేరుపరచి పాలే త్రాగుతుందో, అల్లే మనంకూడా, సుఖదుఃఖాలతో మిశ్రితమైవున్న ఈ ప్రపంచంలో సుఖమే గ్రహించాలి, అని

ప్ర:—సుఖమంటే ఏమిటి నీ వుద్దేశం?

య:—మేడలలో నివసించడం, సిరి సంపద కలిగివుండడం, చేతిక్రింద మన అధికారానికి లొంగివుండే నౌకర్లు ఉండడం, సౌందర్యస్త్రీలతో ఉద్యాన వనాలలో విహరించడం.

ప్ర:—అవన్నీ తుచ్ఛసుఖాలు; మీసాలపై తేనియలు.

య:—అబద్ధం నీకుతెలీదు. వాటిని పొందటానికి శక్తిలేక తుచ్ఛసుఖాలని త్రోసివేయడం, ద్రాక్షపండ్లు గుత్తి అందని నక్క 'అవి పుల్లగావుంటవితే' అని మనస్సుకు సమాధానం చెప్పుకున్నట్లు వుంటుంది.

ప్ర:—మన సుఖదుఃఖానుభవాలు ప్రారబ్ధాన్ని అనుసరించి వుంటవి. మనచేతిలో ఏమీలేదు.

య:—అవి పుంసత్వము లేనివాని మాటలు. నెపోలియన్ జీవితచరిత్ర ఎప్పుడైనా చదివేవా?

ప్ర:—ఎవరాయన? మనఋషిసంతతిలో వాడేనా?

య:—(హేళనగా నవ్వుతూ) నీకు ఆంగ్లభాషా జ్ఞానం బొత్తిగా లేనట్లున్నదే!

ప్ర:—ఔను. నేను వేదాలు వల్లెవేశాను. స్మృతులు అవలోడించాను. పురాణాలు పఠించాను.

య:—భేష్ కాని అవి నీకు ప్రేమతత్వాన్ని సరిగ్గా బోధపరచలే దన్నమాట.

ప్ర:—ఎందుచేత?

య:—ప్రేమోపాసకుడవైతే వరూధినిని విడిచి వెళ్ళవు.

ప్ర:—నేను విషయలంపటుడను కాదు. విషయ వాంఛయే ఉత్కృష్టమైన ప్రేమయని నీ అభిప్రాయమా?

య:—చెబుతావిను. ప్రేమ అనేది నిర్మలమైన సెలయేరు వంటిది. గులకరాలమీద జలజలా, ప్రబ్బలలో గిలగిలా, మైదానములో ప్రశాంతంగా ప్రవహిస్తుంది స్వేచ్ఛాగానం చేసికుంటూ. ఒక్కభార్యమీదనే కేంద్రీకరింపబడిన ప్రేమ వర్షపు నీరునిల్చిన ఒక కుంట వంటిది. ఎండాకాలంలో అపురూపమై పోవచ్చు.

ప్ర:—అయితే ఋష్యాదు లేర్పరచిన వివాహ బంధానికి అర్థంలేదన్నమాట! నాయనా! మీవంటి వాళ్ళ పుట్టుక హిందూమతానికి ఎంత సహకారమైన అవుతున్నది. శారదాబిల్లుతో అపాయకరమైన గాయం తగిలింది; ఇంకేం, నీపేరకూడ ఒకచట్టం ప్రవేశపెట్టితివా హైందవత్వం పూర్తిగా నశించిపోతుంది; నీకండ్లు చల్లబడగలవు.

య:—కోపపడవద్దు. నేను చెప్పేది బాగా ఆలో

చించి అర్థంచేసుకో. బహుకాంతా సంగమము మనకు అనేక జీవాత్మలతో ఐక్యం కలిగిస్తుంది. తన్మూలాన మన ఆత్మకు వికాసము అంతకంతకు అధికమౌతూ పరమాత్మకు దగ్గరౌతుంది.

ప్ర:—ఆహా! ఏమితర్కం! కేవలము కలిస్వరూపమట్లున్నావే! ఈ నీ మార్గంవల్ల ముక్తిపొందాలని తలచితివా, భగవంతుని ఈ సృష్టిలోని స్త్రీయాత్మలన్నింటినీ ఒక్కొక్కటిగ వెదకికొనుచూ—ఎన్నాళ్ళకు నీ పరమావధిని చేరగలవో లెక్కవేసికొన్నావా?

య:—అందుకోసరం ఎన్ని జన్మలైనా ఎత్తుతాను; నాకు విసుగులేదు.

ప్ర:—మొండితనం! ఎన్ని జన్మలెత్తినా నీకు మోక్షం సున్నా—అరెరే! లోకమెంత పాపభూయిష్టమైంది! రంకే మోక్షసాధనమా? అది పురుషులకు యశోహాని; స్త్రీల సౌశీల్యానికి భంగకరము. సిగ్గు, సిగ్గు. అవినీతి.

య:—నీతి అనేది ధృవనక్షత్రమువలె స్థిరమైనది కాదు. కాలానికి ఒకనీతి; దేశానికి ఒకనీతి. కొన్ని దేశాలలో మారుమనువు తప్పులేదు; మనదేశంలో అట్లా మారుమనువు చేసికొన్న స్త్రీకి బ్రతికివుండగానే శ్రాద్ధం పెట్టమంటాడు మనువు. స్త్రీ సహగమనం చేయకపోవడం ఒకప్పుడు చాలపాపంగా పరిగణించాం మనం. ఇప్పుడా ఆచారమే లేదు.

నా మార్గం స్త్రీల సౌశీల్యానికి భంగకరమని వాపోయ్యావే! స్త్రీల ప్రకృతి తెలిసివుంటే అలాగనవు. స్త్రీ ప్రేమ స్వార్థముచేత మలినముకానిది. తనప్రేమ ఎంతమందికైనా ఇచ్చివేయగలదు. నీవొక స్త్రీని ప్రేమించి విముఖుడవుకావడం అరుదు.

ప్ర:—స్త్రీలు ఇచ్చివేసేప్రేమకు మాత్రు ప్రేమ అంటారు. పాతివ్రత్య తేజస్సుతో వెలుగుతూండే తల్లులపైకి నీ తుచ్ఛప్రేమ ప్రసరింపజాలదు. దీపముపై బడిన శలభమువలె నశించెదవు.

య:—ప్రేమకోసరం బలికావడం ఒక మహత్తరమైన ఆశయం. అందుకు రావణుడు మంచి వుదాహరణం. తన రాజ్యమంతా ఆహుతికానీ సీతమీది ప్రేమ వదలుకోలేదు.

ప్ర:—మూర్ఖుడు.

య:—రాముడికంటె ఆదర్శనీయుడు మనకు అడవుల్లో సీత కష్టాలుపడటము సహించజాలని తన ప్రేమ హృదయం ప్రేరేపింపగా వచ్చి ఆమెను ఎత్తుకు పోయాడు. చివరకామె ప్రేమ సంపాదించాడు. అశోకవనంలో అతన్ని తనతొడమీద పడుకోబెట్టుకుని ప్రేమాశ్రువులు రాల్చింది అతని కళ్ళలోకి సీత.

ప్ర:—ఛీ. ఛీ. నీ స్వకపోలకల్పన నాకు కర్ణకఠోరంగా వుంది.

య:—వాల్మీకి అట్లా రాయలేదనా? ఆయనదే కల్పన. నేను చెప్పింది అసలు కథలోవిషయం. ఇంకో సంగతి; సావిత్రి సత్యవంతుణ్ణి ఎట్లు బ్రతికించుకో గలిగిందో తెలుసా! తన సౌందర్యముచూచి మోహపడిన యముని కోరిక తీర్చి.

ప్ర:—చాలుచాలు. ఆపు నీధోరణి. ఇట్టి మాటలు వింటూన్న నా తను వింతలింతలు తునియలై పోదేమి? నాయనా! నీవు నామతాన్ని దూషించావు. నాదైవాన్ని అగౌరవించావు. అందుకు శాపపీడితుడవు గాక తప్పదు.

నీవు తర్కముతో సత్యము అవగతము చేసికోలేవు ప్రతి ఆత్మలోనూ పరమాత్మ అంతర్యామియైవున్నాడు కదా. పరమాత్మను తెలిసికోవడమంటే నీ యాత్మలోని ఆ భగవజ్జ్యోతిని తెలిసికోవడమే. ఎప్పుడు నీ ఆత్మలోని భగవత్తత్వం నీ మనస్సుద్వారా, నీ ఇచ్ఛద్వారా, నీ ప్రేమలో, నీవుచేసే పనిలో ప్రవహించుతుందో అప్పుడు నీవే భగవంతుడివి. భగవంతుడే నీవు. నాడు నీవు మృత్యువును గెలువగలవు ఆత్మస్వరూపుడవై నావు గనుక. అదీ నిజమైన మోక్షమంటే; అంతేగాని బహుకాంతా సంగమము నిన్నధోలోకానికి తీసికొని పోగలదు. జాగ్రత్త. ఇక నేను పోవాలి. ఆహ్నిక క్రియాకలాపము నెరవేర్చుటకు సమయమైంది.

(దక్షిణముఖంగా వెళ్ళిపోయాడు)

య:—పోవయ్యా, పో. ఏ శంకరభాష్యంలోని

ముక్కలో చిలుకవలె మళ్ళీ ప్రతిధ్వనిచేయడం తప్పితే నీ వేదాంతం నీకే అర్థంకానిది. గుడ్డకట్టుకోవడం కూడా తెలీని 'ఎబోరిజినీ'ల నాటి ఆచారాలు సనాతనమైనవని శిరసావహిస్తావు నువ్వు. సర్వోత్కృష్టమై నీ యభివృద్ధికి కారణములైన నూతనపద్ధతులను నిరసిస్తావు. నీకు వెనుకచూపేకాని ముందుచూపులేదు. అజ్ఞానముతో, మూఢనమ్మకాలతో, అర్థంలేని పూర్వాచారములతో, వ్యక్తిస్వాతంత్ర్యాన్ని చంపివేసే మీ సంఘ చట్టాలతో, బిగుతుగా బంధింపబడి పైగా మోక్ష మార్గ ముపదేశింప సమర్థుడవైతివా! బలే! నావంటి వాళ్ళు లోకమరమ్మతుకోసరం పూనుకుంటేనేగాని మీరు పైకిరాజాలరు.

సరే, ఇక నా కార్యక్రమం గుర్తించి. ప్రవరాఖ్యుణ్ణిచూచి వరూధిని మోహించడం, అతనిమీద పడటం, అంతా చూచానుకదా దూరాన్నుంచి. నేను నిన్నినాళ్ళనుంచీ దాన్ని లాలిస్తుంటే నా బాహువులలో చిక్కించుకోలేకపోయ్యాను. ఆ బ్రాహ్మణుని వేషంతో పోయి నా అదృష్టాన్ని పరీక్షించుకుంటాను. ఈసారి నెగ్గగలనని ధైర్యంగా వుంది.

(కూనిరాగంతీసుకుంటూ అటుకేసి వెళ్ళిపోయాడు).

నేనుకూడా వెళ్ళిపోదామని వ్రాసుకున్న కాగితాలు మడిచి జేబులోపెట్టేసుకుని నాలుగువైపులా తేరిపారచూచాను ఒక్కసారి. దారిడొంకా ఏమీ కనుపించడంలేదు. ఇల్లు చేరుకోవడమెల్లాగా అనే సమస్యలోపడ్డాను. నాకు తోడు ప్రవరాఖ్యుడు వున్నాడు గదా అనేధైర్యంతో ఆ బ్రాహ్మణుడు పోయిన దారిన నేనూ నడిచాను

నే నాయనదగ్గరకు వచ్చేసరికి చేతులురెండూ జోడించి అగ్నిదేవుణ్ణి కాబోలు ప్రార్థిస్తున్నాడు. ఆయన్ను సమీపించాను. అచ్చెరువైంది నాకు; కొంచెంకొంచెం భూమిమీదనుండి లేస్తున్నాడు. బ్రాహ్మణప్రభావం కాబోలు ననుకున్నాను: రెండు గజాలెత్తు లేచాడు. ఇక నాగితే దొరికిన అవకాశాన్ని పోగొట్టుకోవడమౌతుందని ఆయన రెండు కాళ్ళూ లంకించుకున్నాను. ఇంకేంచెప్పేది? వాయువేగ మనోవేగాలలో ఎగిరిపోతున్నా మిద్దరమూను మావూరు వచ్చేసరికి చేతులు రెండూ వదలేశాను. దబీలున క్రిందికి కూలేను.—

కన్నులు తెరచి చూచేసరికి ఏముంది? మంచంమీద పడుకున్నవాణ్ణి క్రిందపడి వున్నాను. నా ప్రక్కనే 'మనుచరిత్ర' కూడా పడివుంది.

—పురాణం కుమారరాఘవశాస్త్రి.

# ఒక స్నేహితునకు

## (అనువృత్తము)

చీకటియె వెల్తురను భ్రాంతి జెందుచోట
తాపమునె సౌఖ్యమనియెంచి తలచుచోట
ఆర్తి నారోగ్యమని చిత్త మరయుచోట
నేడుపే జన్మసాక్షియై యెసగుచోట
పావనాత్మక! యిటశాంతి బడయగలవె?
కలహములు శోకులనిశంబు గలుగుచోట,
జనకుడైనను కఠినత్వమును వహించి
తనదు సుతు నింటనుండి పోదఱుముచోట,
స్వార్థపరతయే నిత్యంబు సర్వకార్య
ములను నడిపించు సూత్రమై వెలయుచోట
ప్రవిమలానంత సంప్రాప్తి భాగ్యమకట!
మానిచంద్రమ! సుంతైన కానగలవె?
బహుళ సుఖదుఃఖ కలిత మీ పాడుజగతి
దీని తప్పించుకొనగ నెవ్వాని తరము?
కర్మనిగళంబుచే బద్ధ కంఠుడైన
మందభాగ్యుండు మోక్షసంపత్తి ధరణి
నెనయుగల్గునె తుదకు తా నెచటనైన?
యోగసాధన, విషయ సౌఖ్యోదయంబు